సాక్షి అనంతపురం

గురువారం | 10 | జూలై | 2025

చివరి దర్శనం.. భక్తుల పరవశం



గూగూడు కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో భక్తులు పరవశం చెందారు. స్వామి వారికి బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు హుసేనప్ప ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల కొండన్న వంశస్థులు స్వామి వారి ప్రతిమను పట్టు వస్త్రాల మధ్య భక్తులకు చూపగా.. కొబ్బరి దివిటీల వెలుగులో, సన్నాయి వాయిద్యాల మధ్య పట్టు వస్త్రాలు, బంగారు గొలుసుల నడుమ మెరిసిపోతున్న స్వామి వారి వైభవాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు.

– నార్పల:

న్యూస్‌రీల్

నేడు హెచ్చెల్సీకి నీటి విడుదల



బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి గురువారం ఎగువ కాలువ (హెచ్చెల్సీ)తో పాటు దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు టీబీ బోర్డు అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. దీనిపై గత నెల 27న బెంగళూరులోని విధానసౌధలో జరిగిన 124వ నీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు ఈ నెల 10 నుంచి నవంబర్ 30 వరకూ ఏపీ, కర్ణాటక ఇరు రాష్ట్రాల కోటా నీరు కలిపి దాదాపు 1,300 క్యూసెక్కులు వదలనున్నారు. కొత్త క్రస్టు గేట్ల ఏర్పాటు నేపథ్యంలో ఖరీఫ్‌కు మాత్రమే నీరివ్వనున్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బుధవారం కూడా తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో కొనసాగింది. ఈ క్రమంలో డ్యాం 16 గేట్లను రెండున్నర అడుగుల మేర ఎత్తి 45,280 క్యూసెక్కులు నదికి, మరో 7,400 క్యూసెక్కుల మేర కాలువలకు వదులుతున్నారు. మొత్తంగా ఇన్‌ఫ్లో 51,955 కూసెక్కులు, అవుట్‌ఫ్లో 52,678 క్యూసెక్కులుగా నమోదైంది. జలాశయం ఎగువ పరివాహక ప్రాంతాలైన వరనాడు, శివమొగ్గ, మలేనాడు, ఆగుంబే, శృంగేరి, తీర్థనహళ్లి, కొప్పి, చిక్ మగళూర్ తదితర ప్రాంతాల్లో వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. ప్రస్తుతం డ్యాంలో 1,633 అడుగులకు గాను 1,624.80 అడుగుల వద్ద 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి గాను 75.837 టీఎంసీల నీరు ఉంది.

ఉపాధ్యాయుడి బలవన్మరణం



అంకిరెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

అనంతపురం సిటీ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ ఉపాధ్యాయుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి సమీపంలోని బొడాయిపల్లికి చెందిన కుమ్మెత అంకిరెడ్డి (45)కి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పాక్షిక అంధత్వం కోటా కింద ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన ఆయన మొన్నటి వరకూ బుక్కరాయసముద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు పండిట్‌గా పనిచేశారు. గత నెల జరిగిన బదిలీల్లో భాగంగా అదే మండలం సిద్ధరాంపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీ అయ్యారు. అనంతపురంలోని విద్యుత్ నగర్ సర్కిల్ 3వ క్రాస్‌లో నివాసముంటూ రోజూ పాఠశాలకు విధులకు వెళ్లి వచ్చేవారు. మొదటి కుమారుడు జ్ఞానదీపరెడ్డి ఇంటర్ పూర్తి చేశాడు. రెండో కుమారుడు హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పిల్లలను చదివించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మానసిక క్షోభకు గురైన అంకిరెడ్డి బుధవారం తెల్లవారుజామున ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. జీఆర్పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా భావించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాసేపటి తర్వాత కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అంకిరెడ్డిగా నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

'నాడు–నేడు' పనులకు పాడె కట్టారు. ఇప్పటికీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో స్టూడెంట్ కిట్లు అందించలేదు. అనేక కొర్రీలతో 'తల్లికి వందనం' కొందరికే పరిమితం చేశారు. సమస్యల వలయంలో చిక్కుకున్న ప్రభుత్వ పాఠశాలలను పట్టాలెక్కిద్దామన్న స్పృహే లేదు. అయినా మెగా పీటీఎం పేరుతో 'చదువుల పండుగ' అంటూ కూటమి ప్రభుత్వం ఆర్భాటాలకు తెరతీయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదేం పండుగో అర్థం కావడం లేదంటూ సామాన్య ప్రజలు పెదవి విరుస్తున్నారు.

సమస్యలు నిండుగా.. ఇదేం పండుగ!



బ్రహ్మసముద్రం మండలం గొంచిరెడ్డి పల్లిలో ఆరుబయట చెట్ల కిందే పిల్లల చదువులు.. ఈ బడిలో నాడు-నేడు కింద చేపడుతున్న భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి..

నేడు మెగా పీటీఎం 2.0

- ప్రభుత్వ బడుల అభివృద్ధిపై దృష్టి పెట్టని కూటమి సర్కారు
- 'నాడు–నేడు' నిలిచిపోవడంతో చెట్ల కింద, నిర్మాణ భవనాల్లో చదువులు
- విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందని 'స్టూడెంట్ కిట్లు'
- ఆర్భాటాలపై సర్వత్రా విమర్శలు



తాడిపత్రిలోని బాలికల పాఠశాలలో నిర్మాణంలో ఉన్న గదిలోనే తరగతి నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: గత ప్రభుత్వంలో 'మన బడి నాడు–నేడు' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. వేలాది పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా మార్చారు. తొలివిడతలో ఎంపిక చేసిన పాఠశాలల్లో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. రెండోవిడత మరిన్ని పాఠశాలలను ఎంపిక చేసి పనులను ప్రారంభించారు. కొన్ని బడుల్లో 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంతలో ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఏ ఒక్క స్కూల్‌లోనూ 'నాడు–నేడు' పనులు ఇంచుకూడా ముందుకుసాగలేదు. దీంతో గదులు లేక చాలా స్కూళ్లలో చెట్లకింద, వరండాల్లో, నిర్మాణంలో ఉన్న గదుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారు. మరోవైపు 'నాడు–నేడు' ఆగడంతో ప్రతి స్కూల్‌లోనూ సిమెంట్ బస్తాలు గడ్డకట్టి పనికి రాకుండా పోయాయి.

అరకొర కిట్లు, కొందరికే 'తల్లికి వందనం'

విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులవుతున్నా ఇప్పటికీ విద్యార్థుల చేతుల్లో పూర్తిస్థాయిలో స్టూడెంట్ కిట్లు లేవు. ఏ ఒక్క స్కూల్‌లోనూ విద్యార్థులు కొత్త యూనిఫాం ధరించలేదు. ఏదో ఒక వస్తువు పెండింగ్ పెట్టారు. దీనికితోడు 'తల్లికి వందనం' కింద ఒక కుటుంబంలో ఎంత మంది విద్యార్థులుంటే అందరికీ రూ. 15 వేల చొప్పున జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం గత సంవత్సరం రూపాయి కూడా ఇవ్వకుండా మమ అనిపించింది. ఈసారి పథకాన్ని అమలు చేసినా అనేక కొర్రీలతో కొందరికే పరిమితం చేసింది. అర్హులైన తల్లులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

నేడు మెగా పీటీఎం..


సమస్యలతో విద్యార్థులు సతమతమవుతుంటే 'చదువుల పండుగ' అంటూ మెగా పేరెంట్స్, టీచర్స్ 2.0 మీటింగ్ పేరుతో గురువారం అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో కార్యక్రమాల ఏర్పాటుకు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే ప్రతి విద్యార్థికీ 'గ్రీన్ పాస్‌పోర్టు' ఇస్తారు. ఈ గ్రీన్ పాస్‌పోర్టులు బుధవారం సాయంత్రానికి స్కూళ్ల పాయింట్లకు చేరాయి. అయితే, సమయం లేకపోవడంతో తూతూమంత్రంగా కొన్నింటిలో మాత్రమే వివరాలు పొందుపరిచి సిద్ధం చేశారు. అలాగే హోలిస్టిక్ కార్డులు కూడా 40 శాతం మందికి పైగా విద్యార్థులకు సిద్ధం చేయలేదు. మెగా పీటీఎం పూర్తయిన తర్వాత అందజేస్తామని హెచ్‌ఎంలు, ఎంఈఓలు చెబుతున్నారు.

అటకెక్కిన చదువులు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండోసారి చేపడుతున్న తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాల నిర్వహణ 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'లో చోటు దక్కించుకోవాలనే ఉద్దేశంతో పిల్లల చదువులను పక్కన పెట్టి మరీ కసరత్తు చేయడం గమనార్హం. వారం రోజులుగా పూటకోసారి వెబెక్స్‌లు పెడుతున్నారు. పాఠశాల స్థాయిలో విజయవంతం చేయాలంటే హెచ్‌ఎంలతోనే సాధ్యం కాదు. వారు టీచర్ల సాయం తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో టీచర్లు కూడా ఇదే పనిలో నిమగ్నమయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. కలెక్టర్లకు కూడా 'ఆ జిల్లా ముందు.. ఈ జిల్లా వెనుక' అంటూ పోటీలు పెట్టడంతో వారూ అన్నిటికంటే కూడా ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పని చేస్తున్నారు... చేయిస్తున్నారు. చివరి మూడు రోజులైతే విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు, ఉద్యోగులు మొత్తం కలెక్టరేట్‌లోనే తిష్టవేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి బృందాలుగా ఏర్పడి ఉదయం నుంచి సాయంత్రం వరకు హెచ్‌ఎంలకు ఫోన్లు చేయడమే పనిగా పెట్టుకున్నారు. కమిషనర్ నుంచి ఆర్జేడీలకు.. అక్కడి నుంచి డీఈఓలకు వారినుంచి డీవైఈఓలకు వారి నుంచి ఎంఈఓలకు వీరినుంచి హెచ్‌ఎంలకు వారి నుంచి చివరగా ఉపాధ్యాయులకు మెగా పీటీఎం నిర్వహణపై కసరత్తుకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. జూన్ అంతా అడ్మిషన్లు, స్టూడెంట్ కిట్ల పంపిణీతో సరిపోయిందని, ఈనెలలో ఇప్పటిదాకా మెగా పీటీఎం నిర్వహణ పనులే సరిపోయాయని టీచర్లు వాపోతున్నారు.

ఎన్ని ఆంక్షలు పెట్టినా ప్రజల పక్షమే

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



అనంతపురం కార్పొరేషన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజల్లోకి వెళ్లనివ్వకుండా కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా పోలీసులను అడ్డంపెట్టుకుని వివాదాలకు తెర తీస్తోందని, ఎవరెన్ని ఆంక్షలు పెట్టినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా బంగారు పాళ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మామిడి రైతులను పరామర్శించేందుకు వెళితే.. పోలీసులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, రైతులపై లాఠీచార్జ్ చేయడాన్ని బుధవారం ఓ ప్రకటనలో ఆయన ఖండించారు. సీఎం చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయని, ధాన్యం, పొగాకు, మిర్చి రైతులు..ఇప్పుడు మామిడి రైతులు గిట్టుబాటు ధరలేక అల్లాడిపోతున్నారని వాపోయారు. ఇలాంటి తరుణంలో మామిడి రైతుల పక్షాన నిలబడేందుకు వైఎస్ జగన్ వెళితే.. పోలీసులు వ్యవహరించిన తీరు ఆక్షేపణీయమన్నారు. పక్కా ప్లాన్‌తోనే ప్రభుత్వం, పోలీసులు జగన్ పర్యటనల్లో వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ వస్తున్నారని తెలియగానే రైతులు, నాయకులను బెదిరించారని, నోటీసులు జారీ చేశారని, జగన్‌ను కలిస్తే రౌడీషీట్లు తెరుస్తామని సాక్షాత్తు ఎస్పీ స్థాయి అధికారి బెదిరించడం చూస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అనే అనుమానం కలగకమానదన్నారు. తన వైఫల్యాలను ఎవరూ ప్రశ్నించకూడదన్న ధోరణిలో చంద్రబాబు వ్యవహరిస్తున్నారన్నారు. ఎంత మందిపై కేసులు పెట్టినా ప్రజల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

కుదరని బేరం.. అంతులేని జాప్యం

- అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిపై పీటముడి
- ఆరు మాసాలుగా కాలయాపన
- పేర్ల లీక్‌తో తమ్ముళ్లలో పెల్లుబుకుతున్న అసంతృప్తి జ్వాలలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిపై పీటముడి వీడటం లేదు. ఇటీవల నామమాత్రంగా నామినేటెడ్ పోస్టుల భర్తీ చేపట్టిన చంద్రబాబు సర్కారు.. అనంతపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గిరీని మాత్రం ఎవరికీ కట్టబెట్టలేదు. ఇదే క్రమంలో వారికీ, వీరికీ అంటూ పేర్లు లీక్ అవుతుండడంతో 'తమ్ముళ్ల'లో అసంతృప్తి జ్వాలలు పెల్లుబుకుతున్నాయి. చైర్మన్ రేసులో ఉన్నారంటూ తొలుత బల్లా పల్లవి పేరు తెరమీదకొచ్చింది. ఈమెను అధిష్టానం తిరస్కరించడంతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరుడు కోనంకి గంగారాం పేరును పంపారు. ఈయన పేరునూ ఓకే చేయలేదు. తాజాగా నాగభూషణం పేరు వినిపిస్తోంది. ఈయన రెండేళ్ల క్రితం కమ్యూనిస్టు పార్టీ నుంచి టీడీపీలో చేరారు. ఇలాంటి వ్యక్తికి చైర్మన్‌గిరీ అప్పగిస్తున్నారంటూ ఊహాగానాలు వెలువడడంపై అసంతృప్తుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది.

టీడీపీలో అభ్యర్థులే కరువయ్యారా?

అనంతపురం టీడీపీలో 20 ఏళ్లుగా జెండా మోస్తున్న వారున్నారు. వీళ్లను కాదని కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి పదవులిస్తారా అంటూ 'తమ్ముళ్లు' ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కొత్త అభ్యర్థిని తెరమీదకు తెచ్చినా తామందరం కష్టపడి పనిచేశామని, నేడు నామినేటెడ్ పోస్టులనూ వెలకట్టి అమ్ముకుంటున్నారని సీనియర్ టీడీపీ నాయకుడు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నాళ్లు జెండా మోసినా గుర్తించనప్పుడు పార్టీలో ఉండి ఏం చేయాలి అంటూ నిట్టూర్చారు.

'స్థానిక' ఎన్నికల వేళ గ్రూపుల గోల..

రాయలసీమలోనే అతిపెద్ద మార్కెట్ యార్డుగా అనంతపురం మార్కెట్‌కు పేరుంది. అతిపెద్ద చీనీ మార్కెట్ కూడా ఇదే. వారం వారం వేలాదిగా పశువుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. అలాంటి మార్కెట్ యార్డు చైర్మన్ పోస్టు దక్కించుకోవాలని ఎంతోమంది ఆశగా ఉంటారు. కానీ డబ్బు ఎవరు ఎక్కువగా ఇస్తే వారికే పోస్టు అన్నట్టుగా పరిస్థితి తయారైంది. దీంతో ఆశావహులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. మరికొన్ని నెలల్లో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు జరగనున్న వేళ టీడీపీలో గ్రూపు రాజకీయాలు తారస్థాయికి చేరాయి. చాలామంది సీనియర్లు తమకు గుర్తింపు దక్కక పోవడంతో ఎమ్మెల్యేలపై ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటికే శింగనమల ఎమ్మెల్యేపై మండల స్థాయి నేతలు తిరుగుబావుటా ఎగురవేశారు. అనంతపురం అర్బన్‌లో తాజాగా రెండు గ్రూపులు అయ్యాయి. రోజూ నువ్వా నేనా అంటూ కత్తులు దూసుకుంటున్నారు. ఇటీవల నిర్వహించిన 'తొలి అడుగు–ఇంటింటికీ సుపరిపాలన' కార్యక్రమం నామమాత్రంగా కూడా సక్సెస్ కాలేదు. ఈ పరిస్థితుల్లో స్థానిక ఎన్నికల్లో గ్రూపు రాజకీయాలు ఎలా ఉంటాయో అంచనా వేయడానికే కష్టమంటూ 'తమ్ముళ్లు' వాపోతున్నారు.

మూడేళ్లు జేఎన్‌టీయూలో.. తర్వాత స్వీడన్‌లో

- బీటెక్ ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తులు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు తెలిపారు. బీటెక్ కోర్సు మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూలో, ఫైనలియర్ స్వీడన్‌లోని బ్లెకింగ్ వర్సిటీలో చదవొచ్చన్నారు. బీటెక్ డిగ్రీని జేఎన్‌టీయూ, బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్) ప్రదానం చేస్తుందన్నారు. ఎంఎస్ కూడా బ్లెకింగ్ వర్సిటీలోనే పూర్తి చేయొచ్చన్నారు. జేఈఈ, ఏపీ ఈఏపీసెట్, తెలంగాణ ఈఏపీసెట్ అర్హత సాధించి ఉండాలని, విదేశాల్లో ఉద్యోగం సంపాదించడానికి ఈ కోర్సు మంచి అవకాశమని వీసీ పేర్కొన్నారు. బీటెక్ (కంప్యూటర్ సైన్సెస్), బీటెక్ (ఈసీఈ)లో సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులు ఉండి, జేఈఈ మెయిన్స్ ర్యాంకు, ఏపీ ఈఏపీసెట్ ర్యాంకు, ఇతర స్టేట్ ర్యాంకుల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్స్ ఈ నెల 17 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. వివరాలకు 8008802558, 998994453, 9441889732 నంబర్లలో సంప్రదించవచ్చు.

ప్రభుత్వాలపై కార్మికుల కన్నెర్ర





ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు, కార్మికులకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని ఐక్య కార్మిక సంఘాల నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కార్మికులను బానిసలుగా చేస్తున్నాయని దుమ్మెత్తి పోశారు. సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు, ఎనిమిది గంటల పని హక్కును కూటమి ప్రభుత్వం హరించే ప్రయత్నం చేస్తోందని విరుచుకుపడ్డారు. బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు కదం తొక్కారు. ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనంతపురంలోని కృష్ణ కళామందిర్ నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, అంబేడ్కర్ విగ్రహం మీదుగా నగర పాలక సంస్థ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, నాగేంద్రకుమార్, వైఎస్సార్ టీయూ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొర్రపాడు హుసేన్‌పీరా, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, అంగన్‌వాడీ వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి రమాదేవి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతి ప్రసాద్, పద్మావతి మాట్లాడారు. దేశ సంపదను కొల్లగొట్టిన 29 మంది కార్పొరేట్‌లలో 28 మంది గుజరాత్ వారేనని, వారంతా నరేంద్ర మోదీకి దత్త పుత్రులని విమర్శించారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు నష్టదాయకమైన నాలుగు కార్మిక్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ఎనిమిది గంటల పనివిధానాన్ని రద్దు చేసి 12 గంటల పని విధానం, రాత్రి షిఫ్ట్‌లోనూ మహిళలు పని చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, సీఐటీయూ జిల్లా కోశాధికారి గోపాల్, వైఎస్సార్‌టీయూ నాయకులు అనిల్‌కుమార్ యాదవ్, సంపంగి రామాంజినేయులు, ప్రకాష్, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలపైనే రౌడీషీట్ తెరుస్తారా బాబూ?

- మాజీ మంత్రి సాకే శైలజానాథ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

అనంతపురం కార్పొరేషన్: సీఎం చంద్రబాబు రైతు వ్యతిరేకి అని, చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో రైతులపై లాఠీచార్జ్ చేసిన ఘటనతో మరోసారి బాబు వికృత రాజకీయ క్రీడ బహిర్గతమైందని మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. రైతన్నలపైనే రౌడీషీట్ ఓపెన్ చేస్తారా చంద్రబాబూ? ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. బుధవారం అనంతపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మామిడికి గిట్టుబాటు ధర లేదని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బంగారుపాళ్యం పర్యటన చేపడితే పోలీసులను అడ్డం పెట్టుకుని అడ్డుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తోతాపురి మామిడి కిలో రూ.22తో కొనుగోలు చేసేలా అప్పటి సీఎం జగన్ చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. చేతనైతే వైఎస్ జగన్‌తో పోటీ పడి మామిడి కిలో రూ.50 ధరతో కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టండి బాబూ అని సూచించారు. అంతేకానీ రైతులపై ఆంక్షలు విధిస్తే..వైఎస్సార్ సీపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అన్నం పెట్టే రైతులను బాధపెట్టే దుర్మార్గపు పాలనను కూలదోయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్న విషయాన్ని మరచిపోవద్దన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ పంటకు గిట్టుబాటు ధర ఇచ్చారో చెప్పాలన్నారు. వైఎస్ జగన్‌తో గేమ్స్ ఆడొద్దు బాబూ.. తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాకే శివశంకర్, ఓబులేసు పాల్గొన్నారు.

భూముల కేటాయింపు పూర్తి చేయండి

- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులకు భూముల కేటాయింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఆర్‌ఎస్‌డీటీలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి 544–డీకి సంబంధించి తాడిపత్రి మండల పరిధిలో భూసేకరణ పెండింగ్‌లో ఉందన్నారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు వారంలోపు పంపించాలని ఆదేశించారు. సోలార్ ప్రాజెక్ట్‌కు సంబంధించి యాడికి మండలంలో కొంత ప్రభుత్వ భూమిని అప్పగించామని, మిగిలిన భూమికి సంబంధించి రెండు వారాల్లో ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. ఏపీఐఐసీకి సంబంధించి గార్లదిన్నె మండలం కనుంపల్లిలో అర్హులైన పట్టాదారులకు పరిహారం చెల్లింపుపై రెండు రోజుల్లో ప్రతిపాదనలు పంపాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పనిముట్టును ఆయుధంగా చూపి కేసులా?

- పోలీసుల తీరుపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



తాడిపత్రిటౌన్: పొలాల్లో ఉపయోగించే పనిముట్టును ఆయుధంగా చూపి వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు నమోదు చేస్తారా అని పోలీసుల తీరుపై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. మూడు రోజుల క్రితం పెద్దపప్పూరు మండలం వరదాయపల్లికి చెందిన ఆరుగురు వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిపత్రిలో కోర్టుకు హాజరయ్యేందుకు వస్తే పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి దాదాపు 3 రోజులు నిర్బంధించారన్నారు. పొలాల్లో ఉపయోగించే పనిముట్టును ఆయుధంగా పేర్కొని మారణాయుధం లభించిందంటూ కేసు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సజ్జలదిన్నెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సాయి లేకపోతే అతని ఆచూకీ తెలపాలని అతని బంధువును పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి నిర్బంధించినట్లు ఆరోపించారు. అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజేష్‌ను మారణాయుధం కలిగి ఉన్నాడని పోలీసులు నిర్బంధించారని పేర్కొన్నారు. జేసీ ప్రోద్బలంతోనే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇబ్బందులు పడుతున్న నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని, బాధిత కుటుంబ సభ్యులతో కలిసి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. పోలీసులు ఎవరి మెప్పు కోసమో పోయి భవిష్యత్తులో తిప్పలు పడొద్దని పెద్దారెడ్డి హితవు పలికారు.

ఎల్‌పీజీ సిలిండర్ పేలి దుకాణం దగ్ధం

శెట్టూరు: ఎల్‌పీజీ సిలిండర్ పేలిన ఘటనలో ఓ దుకాణం దగ్ధమైంది. వివరాలు.. శెట్టూరు మండలం యాటకల్లు గ్రామానికి చెందిన జంగం రత్నమ్మ అదే గ్రామ ప్రధాన రహదారి పక్కనే ఓ చిన్నపాటి దుకాణం ఏర్పాటు చేసుకుని కిరాణా సరుకులతో పాటు టీ, టిఫెన్ సెంటర్ నిర్వహిస్తోంది. మంగళవారం అర్ధరాత్రి పెద్ద శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే దుకాణం మొత్తం తగులబడుతోంది. మంటలు వ్యాపించకుండా ప్రజలే ఆర్పివేశారు. ఘటనలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు, ఆర్డీఓ వసంత్‌బాబు, డీఎస్పీ రవిబాబు, తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎస్ఐ రాంభూపాల్, సర్పంచ్ ఈరన్న తదితరులు బుధవారం ఉదయం సంఘనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేశారు. దుకాణంలో గ్యాస్ సిలిండ్ పేలి ప్రమాదం జరిగిందా, లేక ఇతర కారణాలతో జరిగిందా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమవుతాయి. సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి విద్యార్థుల గురువందనం కార్యక్రమం, అనంతరం సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమీపాండే ప్రారంభోపన్యాసం చేస్తారు. స్థానిక రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేస్తారు. కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారు. అనంతరం సత్యసాయి పూర్వపు ప్రసంగాలను డిజిటల్ స్క్రీన్‌లపై ప్రదర్శిస్తారు. సాయంత్రం సంగీత విద్వాంసుడు హరిహరణ్ సంగీత కచేరీ నిర్వహిస్తారు.

బ్రిడ్జి నాణ్యత ప్రశ్నార్థకమే!

- నిబంధనలకు విరుద్ధంగా సెంట్రింగ్ పనులు
- స్కాఫ్ ఫోల్డింగ్ మట్టితో కాలువ నింపి నాలుగు రోజుల క్రితం బ్రిడ్జి స్లాబ్ వేసిన వైనం
- నేడు హెచ్చెల్సీకి నీరు విడుదల అవకాశం
- ఇదే జరిగితే రెండు రోజుల్లో కణేకల్లు ప్రాంతానికి నీరు
- మట్టి తొలగిస్తే తప్ప ముందుకు సాగని నీరు
- మట్టి సపోర్ట్ తొలగిస్తే కూలనున్న బ్రిడ్జి


బ్రిడ్జికి కాంక్రీట్ స్లాబ్ వేస్తున్న దృశ్యం


స్కాఫ్ ఫోల్డింగ్ సెంట్రింగ్ కాకుండా మట్టిని కుప్పగా వేసిన దృశ్యం

కణేకల్లు: హెచ్చెల్సీ ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. కొందరు కాంట్రాక్టర్లు నిబంధనలు తుంగలో తొక్కి పనులు చేస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే సెంట్రింగ్ పనులు నిబంధనలకు విరుద్ధంగా పూర్తి చేశారు. హెచ్చెల్సీకి నీరు వస్తే బ్రిడ్జిలు కూలిపోక తప్పదనే భావన అందరిలోనూ వ్యక్తమవుతోంది.

మట్టి పరిచి.. స్లాబ్ వేసి

కణేకల్లు మండలం నాగేపల్లి గ్రామ సమీపంలో 155 కిలోమీటర్ వద్ద శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి గత ఏడాది కుప్పకూలిన విషయం తెలిసిందే. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఈ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 కోట్లను మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేలా చూడాల్సిన హెచ్చెల్సీ అధికారులు ఇందుకు విరుద్ధంగా కాలయాపన చేశారు. దీంతో పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. మరో వైపు పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. హెచ్చెల్సీకి నీటివిడుదల సమయం దగ్గరపడడంతో పనులు తొందరగా పూర్తి చేయాలంటూ అధికారులు ఒత్తిళ్లు మొదలు పెట్టారు. దీంతో కాంట్రాక్టర్ నిబంధనలకు పాతర వేస్తూ పనులు చేపట్టినా నోరు మెదపడం లేదు. బ్రిడ్జి స్లాబ్ వేయాలంటే ముందుగా సెంట్రింగ్ వర్క్ చేయాలి. స్కాఫ్ ఫోల్డింగ్ సెంట్రింగ్ వర్క్ చేసిన తర్వాత ఐరన్ వర్క్ చేయాల్సి ఉంది. అయితే ఇవేవీ చేయకుండానే స్కాఫ్ ఫోల్డింగ్ సెంట్రింగ్ స్థానంలో బ్రిడ్జికి మట్టి పరిచి సోమవారం స్లాబ్ కాంక్రీట్ పని పూర్తి చేశారు.

ఏ స్లాబ్‌కైనా 28 రోజులు సెంట్రింగ్ ఉండాల్సిందే

ఇళ్లయినా, ప్రభుత్వ భవనాలైనా స్లాబ్ వేస్తే టెక్నికల్‌గా 28 రోజులు సపోర్ట్‌గా సెంట్రింగ్ ఉంచాలి. మరీ అత్యవసరమైతే కనీసం 21 రోజులైనా సెంట్రింగ్ ఉంచాలి. అయితే ఇందుకు విరుద్ధంగా నాగేపల్లి బ్రిడ్జి సెంట్రింగ్ స్కాఫ్ ఫోల్డింగ్ సెంట్రింగ్ కాకుండా మట్టితో ఫిల్లింగ్ చేసి స్లాబ్ వేశారు. హెచ్చెల్సీకి 10వ తేది నీరు విడుదల చేస్తే కణేకల్లు ప్రాంతానికి 12వ తేదీ చేరుతాయి. ఈ క్రమంలో నీటి సరఫరాకు సెంట్రింగ్ కోసం వేసిన మట్టి అడ్డంకిగా మారనుంది. దీంతో అధికారులు మట్టిని కచ్చితంగా తొలగించాలి. మట్టి తొలగిస్తే సెంట్రింగ్ సపోర్ట్ లేక బ్రిడ్జి కూలిపోయే ప్రమాదముంది. ప్రస్తుతం ఈ అంశం రైతుల్లో చర్చనీయాంశమైంది.

సెంట్రింగ్ తీసేస్తే...

వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని 35 మీటర్ల పొడవు, 8.5 మీటర్ల వెడల్పుతో బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. 35 మీటర్ల పొడవుతో నిర్మిస్తున్న ఈ బ్రిడ్జికి మధ్యలో పిల్లర్లు కూడా ఉన్నాయి. ఈ పిల్లర్లపై ఐరన్ బీమ్ వేశారు. సెంట్రింగ్ మట్టి తీసేస్తే ఐరన్‌బీమ్ సపోర్ట్‌తో స్లాబ్‌కు ఎలాంటి ముప్పు ఉండదని అధికారులు పేర్కొంటున్నా.. కచ్చితంగా బ్రిడ్జికి ముప్పేనని పలువురు సాంకేతిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. 12 ఇంచుల (ఒక అడుగు) మందంతో వేసే కాంక్రీట్ స్లాబ్‌కు కనీసం సెంట్రింగ్ సపోర్ట్ 21 రోజులైనా ఉండాలని అంటున్నారు. అంతకు తక్కువ వ్యవధిలో సెంట్రింగ్ మట్టి తీసేస్తే బ్రిడ్జి వంగి పోతుందని పేర్కొంటున్నారు.

డబ్బు మిగుల్చుకునేందుకేనా?

స్కాఫ్ ఫోల్డింగ్ సెంట్రింగ్ వర్క్‌కు నిర్వాహకులు రూ.10లక్షలు అడిగినట్లు తెల్సింది. అంత ఖర్చు పెట్టే యోచన లేని కాంట్రాక్టర్ తన స్వలాభం కోసం స్కాఫ్ ఫోల్డింగ్ సెంట్రింగ్‌ను కాదని మట్టితో ఫిల్లింగ్ చేసి బ్రిడ్జి సెంట్రింగ్ పనులు పూర్తి చేశారు. ఈ విషయం తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించండి

- వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్


బాధితులతో మాట్లాడుతున్న ఆంజనేయులు

గార్లదిన్నె: మండలంలోని పాత కల్లూరులో దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంత్రి ఆంజనేయులు డిమాండ్ చేశారు. జరిగిన ఘటనపై బాధితులు, దళిత సంఘాల నాయకులతో కలసి బుధవారం గార్లదిన్నె పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న పాత కల్లూరులో మొహర్రం వేడుకలు సందర్భంగా దళిత సోదరులు అభి, సంతోష్ అలావ్ తొక్కుతుండగా అదే గ్రామానికి చెందిన కొందరు అడ్డుకుని దుర్భాషలాడారు. దళితులు తమ ముందు అలావ్ తొక్కరాదంటూ బెదిరింపులకు దిగారు. ఆ సమయంలో గ్రామపెద్దలు జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మంగళవారం రాత్రి చర్చల పేరుతో నాగార్జున, రాజు, రామయ్యతో పాటు మరో 8 మంది పాత కల్లూరులో ఉన్న అభి, సంతోష్‌ను పిలుచుకెళ్లి దాడి చేశారు. అడ్డుకోబోయిన సంతోష్ తల్లి సుగుణమ్మపై కూడా దాడి చేశారు. గమనించిన స్థానికులు వెంటనే అడ్డుకుని క్షతగాత్రులను అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలంటూ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు నాగరాజు, జైభీమ్ రామాంజనేయులు, పాత కల్లూరు ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు. కాగా, ఘటనకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు.

జిల్లా కోర్టులో న్యాయవాదుల విధుల బహిష్కరణ


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనంతపురం: ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ట్రోలింగ్‌ను నిరసిస్తూ అనంతపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా అశోక స్థూపం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న అన్ని న్యాయస్థానాల్లో న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. న్యాయవాదుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, ఉపాధ్యక్షుడు ధర్మసింగ్ నాయక్, ట్రెజరర్ వెంకట రఘుకుమార్, సంయుక్త కార్యదర్శి జుబేర్, మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బడా నారాయణరెడ్డి, శ్రీకాంత్, భరత్ భూషణ్ రెడ్డి, అవ్వా సురేష్ తదితరులు మాట్లాడుతూ.. ట్రోలింగ్‌తో న్యాయ వ్యవస్థపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సైతం జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించనున్నట్లు తెలిపారు.

హైరిస్క్ కేసులపై జాగ్రత్త వహించండి : డీఎంహెచ్ఓ


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

గార్లదిన్నె: హైరిస్క్ గర్భిణుల విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ ఈ. భ్రమరాంబదేవి ఆదేశించారు. గార్లదిన్నె పీహెచ్‌సీని బుధవారం ఆమె తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. హైరిస్క్ గర్భిణులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ మంజుల, సీహెచ్ఓ లోక్‌నాథ్, హెల్త్ సూపర్‌వైజర్ నరసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

శింగనమల: పెరటి కోళ్ల పెంపకంతో మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చునని రైతులకు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మాధవి సూచించారు. శింగనమల మండలం సోదనపల్లిలో పెరటి కోళ్ల పెంపకంపై బుధవారం రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేవికే ఆధ్వర్యంలో పంటల సాగు, కోళ్ల పెంపకం, పనిముట్లు, విలువ ఆధారిత పదార్థాల తయారీపై ఇస్తున్న శిక్షణ కార్యాక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పశు పోషణ, పశువుల ఆరోగ్యం కాపాడుకోవడం తదితర అంశాలపై చైతన్య పరిచారు. గొర్రెల సంరక్షణ చర్యలను వివరించారు. గొర్రెల పెపంకం దారులు మందలో పొట్టేలు మార్పిడి చేస్తుండడం వల్ల బ్రుసెల్లోసిస్ వ్యాధిని అధిగమించవచ్చునన్నారు. కార్యక్రమంలో పశు వైద్యులు శ్రీహర్ష, తిరుపాలరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆగస్టు 21న స్టార్టప్ పోటీలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్, తదితరులు

అనంతపురం: దివ్యాంగుల ఇంక్యుబేటర్ డీ హబ్ ఆధ్వర్యంలో హైడియాథన్ స్టార్టప్ పోటీలు నిర్వహించనున్నారు. ఆగస్టు 21న జరిగే ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఎస్కేయూలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ డాక్టర్ సి. చంద్రమౌళి, వీవ్ మీడియా ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ సీఈఓ కొప్పుల వసుంధర, డి హబ్ ఇంక్యుబేటర్ ప్రతినిధి సతీష్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉన్న విద్యార్థులు, ఇన్నోవేటర్స్, స్టార్టప్ ఎవరైనా ఈ పోటీలో పాల్గొనవచ్చునన్నారు. పోటీల్లో గెలిచిన వారికి ఫ్రెడ్ ఆఫ్ హైదరాబాద్ అవార్డుతో పాటు రూ.లక్ష నగదు పురస్కారం, అప్‌స్కిల్లింగ్, మెంటర్‌షిప్‌తో పాటు పెట్టుబడులకు అవకాశం కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు.

ఓనర్ నిర్లక్ష్యంపై కేసు నమోదు

కొత్తచెరువు: యువకుడి మృతికి కారణమైన ఐచర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు కొత్తచెరువు పోలీసులు తెలిపారు. వివరాలను బుధవారం వెల్లడించారు. అనంతపురంలోని రాణినగర్‌లో నివాసముంటున్న పచ్చిపాల రామాంజినమ్మ కుమారుడు పి. రాజశేఖర్ (34).. అదే నగరానికి చెందిన ఐచర్ యజమాని అశోక్ వద్ద డ్రైవర్‌గా పనిచేసేవాడు. పోతలకుంట గ్రామ సమీపంలో జరుగుతున్న హంద్రీనీవా కాలవ పనులకు అవసరమైన జనరేటర్‌ను తన ఐచర్ వాహనంలో అమర్చి అశోక్ అద్దెకు ఇచ్చాడు. వాహనంతో పాటు డ్రైవర్ రాజశేఖర్ ఉన్నాడు. జనరేటర్ నిర్వహణకు ప్రత్యేకంగా సాంకేతిక నిపుణుడిని ఏర్పాటు చేయాలిఉండగా ఇందుకు విరుద్ధంగా రాజశేఖర్‌తోనే ఆ పనులూ చేయిస్తూ వచ్చాడు. గత నెల 22న సాయంత్రం 5 గంటలకు జనరేటర్‌లో నీళ్లు పోయాలని రాజశేఖర్‌ను అశోక్ పురమాయించాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి జనరేటర్ రింగ్‌కు తగలడంతో రాజశేఖర్ కుడికాలు బొటన వేలు తెగిపడింది. చికిత్స కోసం తొలుత అనంతపురానికి అనంతరం కర్నూలులోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 7న రాజశేఖర్ మృతి చెందాడు. ఘటనపై బుధవారం మృతుడి తల్లి రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు ఐచర్ యజమాని అశోక్‌పై కేసు నమోదు చేసి,, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

'మేడా'లో అడ్మిషన్.. జీజీహెచ్‌లో డెత్

- వివాదాస్పదంగా మారిన జీజీహెచ్ ఆర్థో వార్డులో యువకుడి మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ 6 గంటలకుపైగా కుటుంబికుల ఆందోళన
- దరిదాపులకు రాని సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం


రాజేష్ మృతదేహం వద్ద బంధువులు, స్నేహితులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం సొంతం నిర్వహిస్తున్న మేడా నర్సింగ్ హోం నుంచి జీజీహెచ్‌కు రెఫర్ అయిన యువకుడు ఆర్థో వార్డులో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డను కోల్పోవాల్సి వచ్చిందంటూ మృతుడి కుటుంబీకులు దాదాపు ఆరు గంటలకు పైగా ఆస్పత్రిలో ఆందోళన చేపట్టారు. వివరాలు.. ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామానికి చెందిన వెంకటేష్, లక్ష్మీదేవి దంపతులకు ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. డిగ్రీ వరకు చదువుకున్న రెండో కుమారుడు రాజేష్ (22) బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. ఈ క్రమంలో తన ఎడమ కాలు నొప్పిగా ఉందంటూ 15 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 3న మేడా నర్సింగ్ హోంకు వెళ్లి డాక్టర్ ఆత్మారాంను సంప్రదించారు. ఆ రోజు అడ్మిషన్‌లో ఉంచుకున్న అనంతరం ఇక్కడైతే డబ్బు ఎక్కువ ఖర్చు అవుతుందని, జీజీహెచ్‌కు వెళితే అక్కడ ఉచితంగా వైద్యం చేస్తారని డాక్టర్ ఆత్మారాం తెలిపి, సిఫారసు చేయడంతో 4న ఆగమేఘాలపై జీజీహెచ్‌లోని ఆర్థో విభాగంలో వైద్యులు అడ్మిట్ చేసుకున్నారు. ఎంఆర్ఐ స్కాన్ తీయించిన అనంతరం ఎడమ కాలులో చీము ఉన్నట్లు నిర్ధారించి, ఈ నెల 7న శస్త్రచికిత్స చేశారు. అనంతరం వైద్యులు కానీ, సిబ్బంది కాని పట్టించుకోక పోవడంతో రెండు రోజుల పాటు నొప్పి తాళలేక రాజేష్ విలవిల్లాడినట్లు తల్లి లక్ష్మీదేవి కన్నీటి పర్యంతమయ్యారు. నొప్పి వచ్చినప్పుడల్లా పీజీ వైద్యులు పరీక్షించి ఓ టాబ్లెట్, ఇంజెక్షన్స్‌ఇచ్చి పడుకోబెట్టేవారని వివరించారు. బుధవారం ఉదయం టిఫిన్ తింటున్న సమయంలో రాజేష్ ఒక్కసారిగా కుప్పకూలాడు. విషయాన్ని వెంటనే డాక్టర్లకు తెలపడంతో వారు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారని వాపోయారు. విషయం తెలుసుకున్న బంధువులు, కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే రాజేష్ మృతి చెందాడంటూ ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న అనంతపురం రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని సర్ది చెప్పడంతో ఆందోళనను విరమించారు. మధ్యాహ్నం 2 గంటలకు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సాయంత్రం పోస్టుమార్టం చేసి మృతుడి కుటుంబీకులకు అప్పగించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

డబ్బు ఖర్చు పెట్టలేరనే జీజీహెచ్‌కు వెళ్లమన్నా



కాలు నొప్పితో రాజేష్ మేడా నర్సింగ్ హోంకు వచ్చాడు. ఒక రోజు ట్రీట్‌మెంట్ ఇచ్చా. మూడు సార్లు ఆపరేషన్ చేయాల్సి ఉందని, అందుకు బోలెడంత డబ్బు ఖర్చు అవుతుందని చెప్పా. వారికి ఆర్థిక స్తోమత లేక పోవడంతో నేనే జీజీహెచ్‌కు రెఫర్ చేసి, ఉచితంగా ఎంఆర్ఐ తీయించి, సర్జరీ చేశా. మృతికి సెప్టిసేమియా కారణమై ఉండవచ్చు.

– డాక్టర్ ఆత్మారాం, మెడికల్ సూపరింటెండెంట్, జీజీహెచ్

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి


బాధితులను పరామర్శిస్తున్న శైలజనాథ్

బుక్కరాయసముద్రం: మండలంలో టీడీపీ కార్యకర్తలు బరితెగించారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడి భయానక వాతావరణం సృష్టించారు. బుధవారం రాత్రి బీకేఎస్ మండలం చెన్నంపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు.. గ్రామంలో పీర్ల పండుగతో పాటు వైఎస్సార్ జయంతిని మంగళవారం అందరూ సంతోషంగా జరుపుకున్నారు. అయితే వైఎస్సార్ జయంతి వేడుకలను ఓర్వలేని టీడీపీ నాయకుడు మల్లికార్జునరెడ్డి, ఆయన అనుచరులు 25 మంది బుధవారం రాత్రి కట్టెలతో, కొడవళ్లతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపైకి దాడికి తెగబడ్డారు. దాడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు లక్ష్మీరెడ్డి, వెంకటరమణ, వెంకటస్వామి, నారాయణస్వామి, ఈశ్వరయ్య, వెంకటేశ్వరమ్మ, దాసన్నగారి బాబు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న శింగనమల నియోజవకర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ శైలజ నాథ్, పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంతరెడ్డి... జీజీహెచ్‌కుచేరుకుని బాధితులను పరామర్శించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువతి అనుమానాస్పద మృతి

అనంతపురం: నగరంలోని సవేరా ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు దివ్య (22) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెంది కనిపించారు. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ గ్రామానికి చెందిన వద్దె దివ్య.. మూడేళ్లుగా సవేరా ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. అదే ఆస్పత్రికి చెందిన హాస్టల్‌లోనే ఉంటున్నారు. ఆరోగ్యం బాగోలేదని మంగళవారం రాత్రి తోటి నర్సులకు తెలిపి ట్యాబ్లెట్లు వేసుకుని నిద్రించారు. బుధవారం మధ్యాహ్నమైనా ఆమె లేవలేదు. మధ్యాహ్నం షిఫ్ట్ నర్సులు వచ్చి పలుకరించినా స్పందన లేకపోవడంతో పల్స్ పరిశీలించారు. నాడి చిన్నగా కొట్టుకుంటుండడంతో వెంటనే సవేరా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, దివ్య మృతిపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తూ నాల్గో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

యాడికి: స్థానిక పంచాయతీ పరిధిలోని కొట్టాలపల్లిలో రెండు కుటుంబాల మధ్య మంగళవారం ఘర్షణ చోటు చేసుకున్న ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన మల్లికార్జున, రమేష్ ఎదురెదురుగా ఉన్న ఇళ్లలో నివాసముంటున్నారు. చిన్నపాటి గొడవ కారణంగా మంగళవారం ఇద్దరి మధ్య మాటామాట పెరిగి మల్లికార్జునపై రమేష్, సురేష్, ప్రశాంత్ దాడి చేశారు. గాయపడిన మల్లికార్జున ఫిర్యాదు మేరకు ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పశువులు తరలిస్తున్న కంటైనర్ పట్టివేత


కంటైనర్‌లో తరలిస్తున్న పశువులు

రాయదుర్గం టౌన్: పశువులను తరలిస్తున్న కంటైనర్‌ను గోరక్షకదళ్, వీహెచ్‌పీ నాయకులు అడ్డుకుని పోలీసుకలు అప్పగించారు. బుధవారం సాయంత్రం ఓ కంటైనర్‌లో దాదాపు 20కి పైగా పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లుగా గుర్తించిన గో రక్షకదళ్ అధ్యక్షుడు ప్రశాంత్‌యాదవ్, వీహెచ్‌పీ నేతలు రాజేష్, మల్లికార్జున తదితరులు అనంతపురం ప్రధాన రహదారిలో రైల్వేగేటు వద్ద అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని కంటైనర్‌ను స్వాధీనం చేసుకుని పీఎస్‌కు తరలించారు. బళ్లారి నుంచి అనంతపురానికి పశువులను తరలిస్తున్నట్లు డ్రైవర్ పేర్కొన్నట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా తరలిస్తున్నందున కేసు నమోదు చేయాలని వీహెచ్‌పీ నాయకులు డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యం

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతి మంగళవారం నుంచి కనిపించడం లేదు. పామిడి మండలం గజరాంపల్లి గ్రామం వద్ద ఉన్న గ్రీన్ గార్మెంట్స్‌లో పనిచేస్తున్న ఆమె.. మంగళవారం ఉదయం విధులకు బస్సుల్లో వెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకోకపోవడంతో తల్లితండ్రులు ఆరా తీశారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

తేనె కోసమెళ్లి..


మృతుడు తిప్పేస్వామి

అమరాపురం: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. వివరాలు.. అమరాపురంలోని గాడి దొడ్డయ్య ఇంటి సమీపంలో ఉన్న చింత చెట్టులో ఉన్న తుట్టె నుంచి తేనెను సేకరించేందుకు బుధవారం అదే గ్రామానికి చెందిన యువకులు తిప్పేస్వామి (35), గిరీష్ సిద్ధమయ్యారు. చెట్టు ఎక్కి తేనె తుట్టె వైపుగా సాగుతుండగా చెట్టు మధ్యలో నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగలి షాక్‌కు గురయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే తిప్పేస్వామి మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన గిరీష్‌కు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు.

క్లుప్తంగా

నేడు శ్రీనివాసుడి కల్యాణం

అనంతపురం కల్చరల్: నగరంలోని హెచ్చెల్సీ కాలనీ వలీస్వామి ఆశ్రమ ప్రాంగణంలోని కొల్హాపూరు మహాలక్ష్మి ఆలయం వేదికగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ప్రతినిధి దేవనూరు విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఆధ్యాత్మికవేత్తలు మణూరు నాగరాజు దంపతులు సంధానకర్తలుగా శ్రీవారి కల్యాణంతో పాటూ ఆషాఢ పౌర్ణమి దీపాన్ని భక్తులందరితో వెలిగిస్తారని, అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

బీమా ప్రీమియం చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ కృష్ణ చైతన్య

రాప్తాడు: ఖరీఫ్ సాగుకు సంబంధించి పంటల బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి కృష్ణ చైతన్య రైతులకు సూచించారు. బుధవారం రాప్తాడులో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంటలు సాగు చేసే రైతులు బీమా ప్రీమియం తప్పనిసరిగా కట్టాలన్నారు. అర్హత ఉన్నా అన్నదాత సుఖీభవ పథకం జాబితాలో అనర్హులుగా చూపితే సదరు రైతులు రైతు సేవ కేంద్రాల్లో అర్జీలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రంజిత, వీహెచ్ఏ సోనియా, ఎంపీఈఓ పద్మ, ఉద్యాన అధికారి దివ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

20న అభినందన సభ

అనంతపురం కల్చరల్: వివిధ సంస్థల నుంచి ఒకేసారి ముగ్గురు అనంత రచయితలు ప్రతిష్టాత్మక పురస్కారాలకు ఎంపిక కావడం పట్ల అరసం (అభ్యుదయ రచయితల సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి హర్షం వెలిబుచ్చారు. ఈ మేరకు అరసం ప్రధాన కార్యదర్శి తన్నీరు నాగేంద్రతో కలిసి ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు యూనివర్సిటీ విశిష్ట ప్రతిభా పురస్కారానికి ఎంపికైన డాక్టర్ శాంతినారాయణ, డాక్టర్ రావూరి భరద్వాజ స్మారక పురస్కారానికి ఎంపికైన బండి నారాయణస్వామి, మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ సాహిత్య విమర్శ పురస్కారానికి ఎంపికైన రాజారామ్‌ను ఈనెల 20న ఉపాధ్యాయభవన్‌లో ఘనంగా సత్కరిస్తున్నట్లు తెలిపారు. సాహితీ అభిమానులు, రచయితలు విచ్చేయాలని కోరారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆత్మకూరు: లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికులకు న్యాయం చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సావిత్రమ్మ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఆత్మకూరులో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అత్యవసర యాప్‌లతో అగంన్‌వాడీ కార్యకర్తలపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, నాయకులు రామయ్య, వలి, జయమ్మ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

11న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

అనంతపురం ఎడ్యుకేషన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ఇతర సమస్యలపై ఈ నెల 11న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపడుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి తెలిపారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జీఓ 77 రద్దు చేయాలనే డిమాండ్లతో ఆందోళన చేపడుతున్నామన్నారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్, నగర అధ్యక్షుడు మంజునాథ్, కోశాధికారి నాని, సహాయ కార్యదర్శి సమీర్, నాయకులు సాయి, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

12 నుంచి 'సంధ్యారవళి'

అనంతపురం కల్చరల్: ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి ప్రతి ఏటా నిర్వహించే 'సంధ్యారవళి' కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నారు. టీటీడీ కల్యాణ మండపం వేదికగా రెండురోజుల పాటు సాగే శాస్త్రీయ నృత్య హేలలో భాగంగా 12న సాయంత్రం 6 గంటలకు నృత్యకళానిలయం చిన్నారుల రంగప్రవేశం ఉంటుంది. 13న ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్విరామంగా కళాకారులు తమ ప్రాంతాల సంస్కృతి సంప్రదాయాలను ఉట్టిపడే విధంగా కళారూపాలను ప్రదర్శిస్తారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు విజయవాడ శ్రీశైవ క్షేత్రం పీఠాధిపతి శివస్వామి చేతుల మీదుగా చిన్నారులకు ప్రశంసాపత్రాలనందిస్తారు.

● మార్మోగుతున్న అఖండ సాయినామస్మరణ

సందర్భం: నేడు గురుపౌర్ణమి

తస్మైశ్రీ గురువేనమః







బుధవారం రాత్రి సాయి నగరోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు, రథం వద్ద కళాకారుల ప్రదర్శన

అనంతపురం కల్చరల్: హైందవ ధర్మంలో గురువుకు విశిష్ట స్థానం ఉంది. బ్రహ్మ రాసిన రాతను సైతం తన బొటనవేలితో తుడిచివేసే శక్తి సంపన్నుడిగా గురువును అందరూ ఆరాధిస్తారు. ఆది గురువుగా భాసిల్లే వ్యాసుడు జన్మించిన తిథిగా ఆషాఢశుద్ధ పౌర్ణమిని గురుపరంపరను గౌరవిస్తూ వేడుకలు జరుపుకుంటారు. అయితే ఇటీవల అంతటి గురుతత్వాన్ని ప్రబోధించిన దత్తాత్రేయుడికి ప్రతిరూపంగా భావించి పూజించే షిరిడీ సాయినాథుడు గురు పౌర్ణమి నాడు విశేష పూజలందుకుంటున్నాడు. ఈసారి సద్గురువులకు ప్రీతికరమైన గురువారం రానుండడంతో వేడుకలు మరింత ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా ఇప్పటికే నగరమంతా షిరిడీ సాయినాథుడి నామస్మరణ మార్మోగుతోంది. గురువుకు ప్రతిరూపమైన దత్తమందిరాల్లో వేడుకలు ఘనంగా జరగనున్నాయి. చాలా చోట్ల విద్యుద్దీపాల వెలుగుల్లో మందిరాలు వెలుగులీనుతున్నాయి.

అఖండసాయి భజన..

భగవంతుని అవతారంగా భావించే ఎంతో మంది సద్గురువులు నిత్యపూజలందుకుంటున్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం కేవలం చెరువుకట్టపై మాత్రమే షిరిడీ సాయిబాబా ఆలయముండేది. క్రమంగా వేణుగోపాలనగర్, ఆదిమూర్తినగర్, మూడో రోడ్డు, రామచంద్రానగర్, మారుతీనగర్, సంగమేష్‌నగర్ తదితర చోట్ల నిలువెత్తు బాబా మందిరాలు సర్వాంగ సుందరంగా వెలిశాయి. ఇక.. గురుపౌర్ణమి వేడుకలు చాలా చోట్ల బుధవారమే ఘనంగా ప్రారంభమయ్యాయి. 24 గంటల అఖండసాయి నామసంకీర్తనను ఉదయం ప్రారంభించారు. గురు పౌర్ణమి సందర్భంగా విశేష పూజోత్సవాలు జరుగుతున్నాయి. స్థానిక వేణుగోపాలనగర్, వేమనా టెలీఫోన్ భవన్ ఎదురుగా ఉన్న శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో ఉదయం నుంచి రాత్రి వరకు అలంకార సేవలు, నగరోత్సవాలు, పది గంటల పాటు మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మందిర నిర్వాహకులు జయచంద్ర చౌదరి తదితరులు తెలియజేశారు. దీంతోపాటు హెచ్చెల్సీ కాలనీలోని సద్గురు వలీస్వామి ఆశ్రమం, కమలానగర్‌లోని సద్గురు రాజ్యలక్ష్మమ్మ ఆశ్రమం, శ్రీ శివబాలయోగి ఆశ్రమం తదితర చోట్ల గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి.

నయనానందకరం.. నగరోత్సవం

అనంతపురం కల్చరల్: గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక వేణుగోపాల్ నగర్ షిరిడీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో నగరోత్సవం నయనానందకరంగా సాగింది. కళాజాత భక్తిభావం నింపింది. సద్గురు సాయినాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రథోత్సవాన్ని ముఖ్య అతిథులుగా విచ్చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ ప్రారంభించారు. విద్యుత్ దీపకాంతుల నడుమ రథం ముందు పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాకారులు వివిధ దేవతారూపాల వేషధారణలతో ప్రదర్శించిన కళారూపాలు అమితంగా ఆకట్టుకున్నాయి. సర్వాంగ సుందరంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పూలరథంపై బాబా ఊరేగుతున్నప్పుడు భక్తులు అడుగడుగునా హారతులు పట్టి ఆశీర్వాదాలనందుకున్నారు. గురువారం పెద్ద ఎత్తున పౌర్ణమి వేడుకలు జరుగుతాయని నిర్వాహకులన్నారు. కార్యక్రమంలో బాబా మందిరం అధ్యక్షులు రంగనాయకులు, కార్యదర్శి నాగేష్, జీవీరమణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రోడ్ల విధ్వంసం



అరవిందనగర్‌లో గుంత తీసి వదిలేసిన దృశ్యం



జడ్జి బంగ్లా ముందు రోడ్డులో గుంతలు తవ్విన దృశ్యం

- గుంతలు తవ్వి వదిలేసిన ప్రైవేట్ కంపెనీ
- పట్టించుకోని ఇంజినీర్లు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో రోడ్ల విధ్వంసం కొనసాగుతోంది. ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ గ్యాస్ పైప్‌లైన్ పనుల పేరుతో ఐదు నెలలుగా నగరంలోని పలు రోడ్లను ఛిద్రం చేస్తోంది. ఇప్పటికే నాయక్ నగర్, అరవిందనగర్, కృపానందనగర్ తదితర ప్రాంతాల్లో గుంతలు తవ్వి..తర్వాత వాటిని తూతూమంత్రంగా పూడ్చారు. ఫలితంగా రోడ్లు అధ్వానంగా కన్పిస్తున్నాయి. ఇంత చేస్తున్నా నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు అటువైపు తొంగి చూడడం లేదు. అరవిందనగర్‌లో సాయిబాబా దేవాలయానికి వెళ్లే మార్గంలో గుంత తీసి కొన్ని నెలలుగా అలాగే వదిలేశారు. కోర్టు రోడ్డుకు వెళ్లే మార్గంలో రహమత్‌నగర్ వద్ద (ఎస్ఎస్ఎస్ కళాశాల ముందు) బాగా ఉన్న రోడ్లను గుంతలమయంగా మార్చేశారు. దీనివల్ల నగర ప్రజలు ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గుంతలను కేవలం కంకర, ఇసుకతో పూడ్చాలని చూస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి వేసిన రోడ్లను ఓ ప్రైవేట్ కంపెనీకి అప్పగించేసిన ఇంజినీరింగ్ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ఓ ఏఈ స్థాయి అధికారిని కూడా పనులు జరిగే చోట పర్యవేక్షణకు ఉంచడం లేదు. ఇక డీఈ, ఈఈలు పత్తా లేకుండా పోయారు. దీంతో ప్రైవేటు కంపెనీ ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వేసుకుంటూ వెళుతోంది.

పీఠాధిపతుల అనుగ్రహ భాషణం

అనంతపురం కల్చరల్: మేదర్ల ఆరాధ్యదైవమైన మల్లాలమ్మ ఆలయానికి బుధవారం అద్వైత పీఠం పీఠాధిపతులు, ఉత్తరాధికారులు అతిదేశ్వరానంద సరస్వతి, భతిహేన్ తిరో స్వామి, యుషిః స్వామి, కౌని పాలిత స్వామి తదితరులు విచ్చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు, కుంకుమార్చనలు జరిగాయి. ఈ సందర్భంగా సూర్యానగర్‌లోని మల్లాలమ్మ ఆలయం ముందు సాగిన సమావేశంలో ఏపీ మేదరి మహేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి పోలేపల్లి నాగరాజు మేదర్లు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు.కుల వృత్తి చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్న మేదర్లు గంపలు, విసనకర్రలు, తడకలు, బొంగులు వంటి అడవి సంపదపై ఆధారపడి రోజురోజుకు భారంగా జీవిస్తున్నారని ఆవేదన చెందారు. నాయకులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని విచారం వ్యక్తం చేశారు. దశాబ్దాలకు పైగా పేదరికంలో మగ్గుతున్న మేదర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎస్టీలోకి మేదర్లను చేర్చాలని డిమాండు చేశారు. గతంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని కోరారు. పీఠాధిపతులు, స్వామీజీలు నాయకులకు, మేదర్లకు మధ్యవర్తిగా వ్యవహరించి న్యాయం జరిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చలపతి, కాకర్ల ప్రభాకర్, రామచంద్ర, మురళి, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో బ్యాంకు ఉద్యోగులు, ఎల్ఐసీ సిబ్బంది



సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం జరిగిన సార్వత్రిక సమ్మెలో బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు, ఎల్ఐసీ సిబ్బంది వేర్వేరుగా ర్యాలీలో పాల్గొన్నారు. బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ వద్ద కెనరాబ్యాంకు నుంచి సుభాష్‌రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. బ్యాంకుల్లో శాశ్వత నియామకాలు చేపట్టాలని, ప్రైవేటీకరణ ఆపాలని, ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ తీసుకురావాలని, ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు రమణరాజు, శివారెడ్డి, సునీత, దర్శన్, మురళీ, శ్రీకాంత్, అరవింద్, వహీద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

- బీమా చట్టాల సవరణ బిల్లును వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసీ సిబ్బంది స్థానిక బ్రాంచి-2 కార్యాలయంలో ఉద్యోగ సంఘం నాయకుడు తాడేపల్లి రామక్రిష్ణ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం దారుణమన్నారు. రిక్రూట్‌మెంట్, జీఎస్టీ తగ్గింపు, పాత పెన్షన్ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఎల్ఐసీ పాలసీదారులపై భారం మోపకూడదని డిమాండ్ చేశారు.

నిత్యావసర ధరలను నియంత్రించాలి



కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: మందులు, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంతో పాటు జీఎస్టీ తొలగించాలని ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఉద్యోగులకు కనీస వేతనం రూ.26,910గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాలని కోరారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌ను బుధవారం ఆయన చాంబర్‌లో సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్, తదితరులు కలిసి వినతి పత్రం అందజేసి తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులకు చట్టబద్ధమైన పని నియామకాలను రూపొందించాలన్నారు. ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపేసి స్వయం సమృద్ధి కోసం ప్రభుత్వరంగ ఫార్మా కంపెనీలను పునరుద్ధరించాలన్నారు. పదవీ విరమణ చేసిన సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులు, కార్మికులకు కనీస పెన్షన్ రూ.9 వేలు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌నాయుడు, నాగరాజు, కదిరప్ప, మధుసూదన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

12న వాహనాల వేలం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో నమోదైన వాహనాలను ఈ నెల 12న ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు సీఐ ఎస్.శేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 34 మోటార్ బైకులు, ఒక ఆటోను బహిరంగ వేలం వేయనున్నట్లు వెల్లడించారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ. 3 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాహనం దక్కించుకున్నవారు రూ.3 వేలు పోను తక్కిన మొత్తం, జీఎస్టీ చెల్లించాలన్నారు.

చెత్త సేకరణ పకడ్బందీగా చేపట్టాలి



చెత్త సేకరణపై వివరాలు సేకరిస్తున్న సీఈఓ శివ శంకర్

రాప్తాడు: పంచాయతీ కార్మికులు తడి, పొడి చెత్తను పకడ్బందీగా సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలని జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా రాప్తాడులోని బీసీ కాలనీలో వారు పర్యటించారు. కార్మికులు చెత్తను సేకరిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ముఖ్యంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మీ, విస్తరణ అధికారి ఆనంద ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్, సర్పంచు సాకే తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



అనంతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దిలీప్ రెడ్డి, జింకల రామాంజినేయులు

అనంతపురం కార్పొరేషన్: పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నేతలకు జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. ఇటీవల పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమితులైన చుక్కలూరు దిలీప్ రెడ్డి, జింకల రామాంజినేయులు బుధవారం అనంతను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారికి అనంత సూచించారు.

ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని బుధవారం డీసీహెచ్ఎస్ రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందికి మెమో ఇచ్చారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న భారతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ముట్టాలలో పీర్లను జలధికి తరలిస్తున్న దృశ్యం



గుండం చుట్టూ ఉన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో జలధి

ఆత్మకూరు: ముట్టాల గ్రామంలో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బుధవారం పీర్లస్వాముల జలధి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి పీర్ల స్వాములకు చక్కెర చదివింపులు చేయించారు. సాయంత్రం గుండం పూడ్చి పీర్ల స్వాములను జలధికి తరలించారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అనంతపురం సిటీ: అనంతపురంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఆ శాఖ ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయిస్ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమాన్నుద్దేశించి యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు మల్లికార్జున, కొండప్ప, ఇతర ప్రతినిధులు నీరజ, జగదీశ్ మాట్లాడారు. 11 ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ.. వాటి పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రాప్తాడులో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు

రాప్తాడు: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజినేయులు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం రాప్తాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు, హమలీలతో కలిసి ఆందోళన నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలహారాలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మానహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష్య, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, పోతులయ్య, సీఐటీయూ నియోజకవర్గ నాయకులు పుష్పరాజు, ఓబులయ్య పాల్గొన్నారు.

దేశాన్ని విశ్వ గురువుగా నిలపడమే లక్ష్యం



కాగడాల ప్రదర్శన ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: దేశాన్ని విశ్వ గురువుగా నిలపడమే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. 77వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి అనంతపురం నగరంలో కాగడాల ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం మాత్రమే కాకుండా విద్యార్థుల్లో జాతీయ భావాలు, దేశభక్తిని పెంపొందిస్తున్నామన్నారు. ఎంతోమంది సాధారణ విద్యార్థులను అసాధారణ నాయకులుగా దేశానికి అందించిన గొప్ప సంఘం ఏబీవీపీ అన్నారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్ నాయక్, విజయ్, బాబు, భూతరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.